RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 286 పేజీలు - 08 గురువారం 10 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక





## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
- నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు
- దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు
- 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం
- తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం
- 4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు
- పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం
- రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు
- ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం
- అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ
- కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

తొలి అక్షరం/హైదారాబాద్, సెప్టెంబర్ 9: అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, మిగతా2లో...






## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- తెలంగాణలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

తొలి అక్షరం/హైదారాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మిగతా2లో...

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన
- 15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన




## స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. నోటీసు ఎలా ఇస్తారు?

- గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం




## గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం

- పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు
- కాంగ్రెస్ సర్కార్‌పై, హామీలపై ఫిర్యాదుల వెల్లువ
- 1000 రోజులు గడిచినా హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై వైఫల్యం
- మా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారు: కేటీఆర్



తొలి అక్షరం/హైదారాబాద్, సెప్టెంబర్ 9: లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు మిగతా2లో...




## సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

- రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు

తొలి అక్షరం/హైదారాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మిగతా2లో...

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్



తొలి అక్షరం/హైదారాబాద్, సెప్టెంబర్ 9: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం మిగతా2లో...

## యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

- ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్
- రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు
- సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..
- శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం




## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

- ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్
- తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన
- మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి
- అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు

తొలి అక్షరం/హైదారాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి"తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ మిగతా2లో...



# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

(మొదటి పేజీ తరువాయి)

ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు.అంతరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం.కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు.

# గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం

(మొదటి పేజీ తరువాయి)

బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి.

పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు.

# సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

**తొలి అక్షరం/అమరావతి,సెప్టెంబర్ 9:** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా..నోటీసు ఎలా ఇస్తారు?

**తొలి అక్షరం/హైదరాబాద్:సెప్టెంబర్ 9:**

జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల్లో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. వాటిని ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. 'ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఓ మేజిస్ట్రేట్‌కు అలా చేయడానికి ఎంత ధైర్యం?' అని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపారు.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9:** దేశంలోని ఏడు కీలక రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమైన క్యాబినెట్ కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణలో ఒక ప్రాజెక్టుకు, ఏపీలో ఒక ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బిలాస్‌పూర్-కాంతి నగరాలను కలుపుతూ ఈ ప్రాజెక్టులు ఉండనున్నాయి. ఇప్పటికే మూడు రైల్వే లైన్లు ఉన్న పలు ప్రాంతాల్లో నాలుగో లైన్ ఏర్పాటుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే రూ.2,000 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, మరో 5,000 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయని, వీటికి ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. అలాగే, మరో 4,000 కిలోమీటర్ల మేర పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు.తెలంగాణకు సంబంధించి ఒక ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఇది ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల పొడవైన నాలుగో లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీని విలువ రూ.2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ధరించింది. ఏపీకి సంబంధించి అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3,4 లైన్ల నిర్మాణం జరగనుంది. మొత్తంగా దక్షిణాదికి సంబంధించి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం అంగీకరించింది.

# యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 9:** యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025-26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు.కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలం టీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, e-POS సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశ పూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

# కర్నె సురేందర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు






**తొలి అక్షరం/జవహర్‌నగర్, సెప్టెంబర్5:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టిపిటిఎల్ఎఫ్)రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదులోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రముఖ విద్యావేత్త కర్నె సురేందర్‌ను రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ నివాసి,గీతాంజలి హైస్కూల్ వైస్ ప్రిన్సిపల్‌గా సేవలందిస్తున్న కర్నె సురేందర్ విద్యాబోధనలో చూపిస్తున్న ప్రతిభ,విద్యార్థుల సమగ్ర వికాసానికి చేస్తున్న కృషికి గాను ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.... విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ...వారిని భావిభారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని పేర్కొన్నారు.తనపై నమ్మకంతో ఈ పురస్కారానికి ఎంపిక చేసిన సంఘ ప్రతినిధులకు, సహకరించిన పాఠశాల యాజమాన్యానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సురేందర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు,పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.


# తెలంగాణ అస్తిత్వానికి కాళోజీ రచనలు ప్రతీక

- మల్టీజోన్ ఐజీ గజరావు భూపాల్,మల్టీజోన్- 11: షానవాజ్ ఖాసిం
- డీజీపీ కార్యాలయంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్9:** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐజీ గజరావు భూపాల్, మల్టీజోన్- 11ఐజీ షానవాజ్ ఖాసిం మాట్లాడారు.ప్రజా సమస్యలపై తన రచనల ద్వారా కాళోజీ కల్పించిన చైతన్యం అపారమైనదని స్మరించుకున్నారు.తెలంగాణ భాష, సంస్కృతి, అస్తిత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన సాహిత్యం సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ (అడ్మిన్) జె.అన్యోన్య, టీజీ స్పార్క్ ఎస్పీ రూపేష్,పేషీ డీఎస్పీ భాస్కర్,స్టోర్స్ డీఎస్పీ సత్యనారాయణ,సీఎస్ఓ యోగేశ్వరరావుతో పాటు ఇతర పోలీస్ అధికారులు,కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు: పురపాలక సంఘ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 9:** ప్రజల పక్షాన నిలిచిన ప్రజా కవి కాళోజి నారాయణరావు అనే పురపాలక సంఘ చైర్పర్సన్ గూగుల్ వత్తు జ్యోతి కొనియాడారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘ కార్యాలయంలో కాళోజి నారాయణ రావు 112వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పురపాలక సంఘ చైర్పర్సన్ గుగులోత్ జ్యోతి పురపాలక సంఘ వైస్ చైర్మన్ సుర్నపు సోమయ్య తో కలిసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ నేలపై ప్రజల గొంతుకగా, అన్యాయాన్ని ప్రశ్నించిన ధైర్యవంతుడిగా, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు కాళోజి నారాయణరావు, ఆయన కేవలం కవి మాత్రమే కాదు ప్రజల కష్టాలను తన కవిత్వంలో ప్రతిబింబించిన ప్రజా ఉద్యమకారుడు, ప్రజాస్వామ్య విలువల కోసం జీవితాంతం పోరాడిన చైతన్యవాదికాళోజి కలం అధికారాన్ని ప్రశ్నించింది అణగారిన వర్గాల బాధలను సమాజం ముందు నిలబెట్టింది. తెలంగాణ సమాజంలో స్వాభిమానం, భాష, సంస్కృతి, హక్కులపై చైతన్యం పెంపొందించడంలో కాళోజి పాత్ర చిరస్మరణీయమని, ఆయన మాటల్లోని నిబద్ధత, రచనల్లోని ఆవేదన, పోరాటంలో కనిపించిన ధైర్యం నేటి తరానికి గొప్ప స్ఫూర్తి అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డుల కౌన్సిలర్లు, బొల్లు రాజు,నిమ్మల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, వినోద్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ కొరతకు డీలర్లు కారణం కాదు

- యజమానులు,డెలివరీ సిబ్బందిపై ఒత్తిడి పెంచొద్దు
- ఫెడరేషన్ ఆఫ్ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ ఆఫ్ ఇండియా విజ్ఞప్తి
- ఎఫ్ఎల్డిఐ జాతీయ అధ్యక్షులు పి.వెంకటేశ్వర్ రావు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్9:** గత ఐదు నెలలుగా దేశవ్యాప్తంగా నెలకొన్న ఎల్పీజీ సిలిండర్ల సరఫరా సమస్యలకు డీలర్లు కారణం కాదని, మార్కెట్‌లో ఉన్న వాస్తవ పరిస్థితులను గ్రహించి వినియోగదారులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని ఫెడరేషన్ ఆఫ్ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎల్డిఐ) జాతీయ అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్ రావు విజ్ఞప్తి చేశారు. సరఫరా లేమి కారణంగా వినియోగదారులతో పాటు డీలర్లు, ఏజెన్సీ సిబ్బంది, డెలివరీ బాయ్స్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. **అంతర్జాతీయ పరిణామాల ప్రభావమే:** అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ముఖ్యంగా హార్ముజ్ జలసంధి ద్వారా భారత్‌కు చేరాల్సిన ఎల్పీజీ నౌకలు నిర్ణీత సమయానికి చేరుకోకపోవడం వంటి కారణాలు సరఫరా ప్రణాళికపై ప్రభావం చూపాయి.ఈ పరిస్థితిని అధిగమించేందుకు భారత ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు అనేక కఠినమైన నిర్ణయాలు తీసుకుంటూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి. అనేక ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో పరిస్థితి మెరుగ్గా ఉండటానికి ఈ చర్యలే ప్రధాన కారణం.అయితే ఈ మొత్తం పరిస్థితికి ఎల్పీజీ డీలర్లే కారణమన్నట్లుగా కొన్ని పత్రికల్లో వార్తలు రావడం బాధాకరం. డీలర్లు సరఫరాను నిర్ణయించే వారు కాదు; చమురు సంస్థల నుంచి అందిన సిలిండర్లను ప్రభుత్వ మరియు చమురు సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగదారులకు పంపిణీ చేయడం మాత్రమే వారి బాధ్యత.గతంలో పాలు ప్యాకెట్ల మాదిరిగా అవసరమైన వెంటనే ఎల్పీజీ సిలిండర్లు అందించే పరిస్థితి ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కావడం లేదు. డీలర్లు తమ ఇష్టానుసారం సిలిండర్లను నిలిపివేయడం, తగ్గించడం లేదా పెంచడం చేయలేరు. చమురు సంస్థల నుంచి ఎంత సరఫరా వస్తే, అందుబాటులో ఉన్న సిలిండర్లను నిబంధనల ప్రకారం వినియోగదారులకు అందించడమే డీలర్ల పని. అదే వారి జీవనోపాధికి కూడా ఆధారం. **డెలివరీ సిబ్బంది విషయంలో వినియోగదారులకు విజ్ఞప్తి:** డెలివరీ సిబ్బంది నిర్ణీత మొత్తానికి మించి డబ్బు వసూలు చేస్తున్నట్లు ఎక్కడైనా జరిగితే, వినియోగదారులు వెంటనే సంబంధిత డీలర్ దృష్టికి తీసుకురావాలి. తప్పు జరిగిన వెంటనే తెలియజేస్తే చర్యలు తీసుకోవడం సులభం.సిలిండర్ తీసుకున్న తర్వాత చాలా ఆలస్యంగా ఫిర్యాదు చేసి, మొత్తం బాధ్యతను డీలర్‌పై వేయడం న్యాయసమ్మతం కాదు. తప్పు ఎవరు చేశారో, ఆ తప్పుకు ఎవరు కారణమయ్యారో సమగ్రంగా పరిశీలించి, బాధ్యులైన వ్యక్తిపైనే చర్యలు తీసుకోవాలి. **ఈ కేవైసీ, బుకింగ్ నిబంధనల విషయంలో డీలర్ల పాత్ర:** వినియోగదారులు ఎదుర్కొంటున్న ఈ కేవైసీ, బుకింగ్ పరిమితులు, ఓటిపి తదితర సమస్యలను డీలర్లు నిరంతరం చమురు సంస్థల దృష్టికి తీసుకెళ్లారు. వినియోగదారులకు ఇబ్బంది తగ్గించేందుకు నిరంతరం విజ్ఞప్తులు చేశారు.ప్రత్యేకంగా 45 రోజుల బుకింగ్ పరిమితిని 25 రోజులకు తగ్గించేలా చర్యలు తీసుకురావడంలో, అలాగే ఈ కేవైసీ గడువు ముగిసిన తరువాత కూడా వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మరింత సమయం ఇవ్వాలని కోరడంలో డీలర్లు తమ వంతు కృషి చేశారు. ఇవన్నీ వినియోగదారుల ప్రయోజనం కోసమే. **డీలర్లు కూడా మనుషులే - సేవా భాగస్వాములే:** కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ ఎల్పిజి డీలర్లు, కార్యాలయ సిబ్బంది, డెలివరీ సిబ్బంది ప్రజలకు సేవలు అందించారు. ఆ సమయంలో ఎంతోమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయినా, ప్రజలకు ఎల్పిజి సరఫరా నిలిచిపోకుండా సేవ కొనసాగించారు.ఈ విషయాన్ని మనం మరచిపోకూడదు.డీలర్లు వినియోగదారులకు శత్రువులు కాదు వారి అవసరాలను తీర్చే సేవా భాగస్వాములు. వారిపై ఆగ్రహం చూపడం కంటే, సమస్యను అర్థం చేసుకుని సహకరించడం ఈ సమయంలో అత్యంత అవసరం.ఈ సందర్భంగా వినియోగదారులు, పాత్రికేయ మిత్రులు, ప్రభుత్వ అధికారులు, చమురు సంస్థల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది మరియు అన్ని వర్గాల ప్రజలకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తూ, ప్రస్తుత పరిస్థితుల తీవ్రతను మరియు వాస్తవాలను అర్థం చేసుకుని మాకు సహకరించాలని వినమ్రంగా కోరుతున్నాము.మమ్మల్ని నిందితులుగా చూడకండి సమస్యలో భాగస్వాములుగా చూడండి.మా సిబ్బందిని అనుమానించకండి మీ సేవ కోసం పనిచేస్తున్న వారిగా గుర్తించండి.సమస్య వచ్చినప్పుడు మాపై ఆగ్రహం చూపకండి మాతో కలిసి పరిష్కారం కోసం ముందుకు రండి.ఎల్పిజి డీలర్లు కూడా మీలాగే కుటుంబాలను పోషించుకుంటూ, ఈ సేవ ద్వారా జీవనోపాధిని కొనసాగిస్తున్న సాధారణ మనుషులే. మీకు సిలిండర్ అందితేనే మా జీవనోపాధి కొనసాగుతుంది; మీ అవసరమే మా వ్యాపారానికి ఆధారం.అందువల్ల ఈ క్లిష్ట సమయంలో వినియోగ దారులు సంయమనం పాటిస్తూ, పాత్రికేయులు వాస్తవాలను పరిశీలిస్తూ, అధికారులు డీలర్ల వాస్తవ ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకుంటూ, సంబంధిత ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాము.ప్రజల సేవలో ఎప్పటిలాగే మేము ముందుంటాము.మీ నమ్మకం మా బలం మీ సహకారం మా ధైర్యం అని పీవీ రావు అన్నారు.

# డ్రగ్స్, గంజాయికి యువత దూరంగా ఉండాలి

- మొబైల్ ఫోన్లకు బానిస కావొద్దు..
- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్




**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 9:** విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ సూచించారు. డీవైఎఫ్ఐ మూడో జిల్లా మహాసభల సందర్భంగా డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై స్థానిక అరవింద జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా సీఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ.. డీవైఎఫ్ఐ కేవలం యువజన పోరాటాలకే పరిమితం కాకుండా విద్యార్థులు, యువతలో అవగాహన కల్పిస్తూ సమాజ మార్పు కోసం ముందుండి పనిచేయడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలు లేదా వినియోగం కనిపిస్తే వెంటనే పోలీస్ యంత్రాంగానికి సమాచారం అందించాలని కోరారు.ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ల వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో యువత వాటికి బానిస కావద్దని సూచించారు. మొబైల్ ఫోన్ల ద్వారా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, విద్యార్థులు అపరిచిత లింకులు, సందేశాలు, ఆన్‌లైన్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తుల శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుకృష్ణ మాట్లాడుతూ.. డీవైఎఫ్ఐ మూడో జిల్లా మహాసభల్లో స్థానిక యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టడం ప్రధాన అంశాలుగా చర్చించనున్నట్లు తెలిపారు.ం

యువజన సమస్యలపై విస్తృతంగా చర్చించి, భవిష్యత్ పోరాటాల ప్రణాళికను రూపొందించడంతో పాటు కార్యాచరణను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది యువ ప్రతినిధులు మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దుర్గయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖయ్యూం, మండల కార్యదర్శి పల్లె శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తీగుళ్ల శ్రీనివాస్, నాయకులు జింకల మహేష్, అధ్యాపకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల డిమాండ్
- చౌటుప్పల్‌లో భారీ మానవహారం..
- పాల్గొన్న కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు




**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 9:** తెలంగాణ రాష్ట్ర డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ పిలుపు మేరకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చౌటుప్పల్‌లోని స్థానిక గాంధీ పార్కు ఆవరణలో డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అసోసియేషన్ మహాత్మాగాంధీ యూనివర్సిటీ గౌరవ అధ్యక్షుడు బత్తుల శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, విద్యార్థుల విద్యాభ్యాసంపై కూడా ప్రభావం పడుతోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యారంగాన్ని ఆదుకోవాలని కోరారు. కళాశా లల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో విష్ణుకుమార్, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, దుర్గయ్య, అధ్యాపకులు రవి, లింగస్వామి, సైదులు, బాలరాజు, సంతోష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాలోజీ జయంతి వేడుకల సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం

**- కాలోజీ సేవలు చిరస్మరణీయం**

**- అప్పాల్ రావుపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్**





తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 9: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పరిధిలోని అప్పలరావుపేటలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలుతన కలంతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ధీశాలి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని అప్పలరావుపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్ అన్నారు. నెక్కొండ మండలం అప్పలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాకవి, పద్మవిభూషణ్ స్వర్గీయ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని "తెలంగాణ భాషా దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాషా పండితులు సాంబారి వెంకట్రాజ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రవణ్ కుమార్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. తెలంగాణ భాషా సౌందర్యాన్ని, మాండలిక మహిమను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. "ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" అని చాటిచెబుతూ, తన కలంతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ధీశాలి కాలోజీ అన్నారు. అన్యాయాన్ని ఎదిరించే గొంతుకగా, ప్రజా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.విద్యార్థులు మాతృభాష ప్రాధాన్యతను గుర్తించాలని, ఎంతటి ఉన్నత చదువులు చదివినా మన తెలంగాణ భాషను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపైనే ఉందన్నారు.కాళోజీ జీవితం నుండి స్ఫూర్తి పొంది, విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని, అన్యాయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవీంద్రనాథ్, భూలక్ష్మి వెంకట్రాం దయాకర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# పత్తి, పెసర పంటల క్షేత్ర పరిశీలన

**● రైతులతో పంటల సాగు, విత్తనాల ఆన్‌లైన్ బుకింగ్‌పై అధికారుల అవగాహన**




తొలి అక్షరం/ఏన్కూర్ సెప్టెంబర్ 9: ఏన్కూర్ మండలంలోని మేడైపల్లి, నాచారం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పత్తి, పెసర పంటల క్షేత్రాలను బుధవారం పరిశీలించారు. కపాస్ కాంతి పథకంలో భాగంగా రైతులకు అందించిన పత్తి విత్తనాలతో సాగు చేసిన పంటలను గౌరవ వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అదేవిధంగా ఆత్మనిర్భరత పథకం కింద రైతులకు అందించిన పెసర పంటను పరిశీలించి, పంట పరిస్థితి, సాగు విధానం, ఎదురవుతున్న సమస్యలపై రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వరి సన్న రకాల విత్తనాలకు బోనస్‌కు సంబంధించిన ప్రక్రియ కోసం రైతులందరూ రేపటిలోగా ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్‌లో విత్తనాలు, ఇతర వ్యవసాయ అవసరాలను ఏ విధంగా బుక్ చేసుకోవాలి, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు వ్యవసాయ శాఖ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సపావత్ సైదులు, నవ్యతో పాటు ఆయా గ్రామాల రైతు సోదరులు పాల్గొన్నారు

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు

**● అందచేసిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్**



తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 9: వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలో స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో లబ్ధిదారులు కార్పొరేట్ హాస్పిటల్ లో వైద్యశీ కోసం పైసలు వెచ్చించి నిరాశ చెశీదాకుండ వారిని ఆదుకోవాలని ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వం లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిచడమే మా ప్రభుత్వం యొక్క లక్ష్యం అని అన్నారు.1,దేశ బోయిన ఆశయం 200002). ఎండి చాందు.120003). దుగ్గి భాస్కర్ రెడ్డి 50500 4). సంపంగి తిరుపతయ్య 96000రూపాయల ముఖ్య మంత్రి సహాయనిది చెక్కులు లబ్ధిదారులకు అందచేసిన నర్సంపేట నియోజకవర్గ టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ సోసైటీ డైరెక్టర్ మండల కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి ఎన్ ఎస్ యు ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోద శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల చేతికి కుట్టుమిషన్.. జీవితాలకు కొత్త భరోసా!

**కోయ్యలగూడెంలో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం**

**మహిళల స్వావలంబనే లక్ష్యం.. బొల్లా శివశంకర్ సేవలకు అభినందనలు**







తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 9: చౌటుప్పల్ మండలం కోయిలగూడెం గ్రామం లో మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కాళ్లపై తాము నిలబడాలనే సంకల్పంతో ఆసరా ఫౌండేషన్ మరో ముందడుగు వేసింది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోయిలగూడెం గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా కుట్టుపని శిక్షణ అందించి, భవిష్యత్‌లో స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, నారాయణపురం మాజీ జెడ్పీటీసీ, అఖిలభారత రాజకీయ విభాగం అధ్యక్షులు బొల్లా శివశంకర్ మాట్లాడుతూ.. మహిళలకు కేవలం ఆర్థిక సహాయం చేయడం కాకుండా, వారికి ఉపాధి చూపించి సొంతంగా ఆదాయం సంపాదించే స్థాయికి తీసుకెళ్లడమే ఆసరా ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు.ఒక మహిళకు ఉపాధి కల్పిస్తే ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని, మహిళలు ఆర్థికంగా ఎదిగితే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కుట్టుమిషన్ శిక్షణతో మహిళలు ఇంటి నుంచే ఉపాధి పొందే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

**"సహాయం ఒక్కరోజుకే.. ఉపాధి జీవితాంతం"**

అవసరంలో ఉన్న వారికి చేయూతనివ్వడంతో పాటు, భవిష్యత్తులో వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే తమ సేవా కార్యక్రమాల ఉద్దేశమని బొల్లా శివశంకర్ తెలిపారు. ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం వంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.కోయిలగూడెంలో ప్రారంభమైన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ద్వారా మరింత మంది మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామస్తులు అభినందించారు. మహిళలకు ఆసరాగా.. నిరుద్యోగులకు భరోసాగా.. పేదలకు అండగా బొల్లా శివశంకర్ చేస్తున్న సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఫౌండేషన్ సెక్రటరీ బొల్ల కవిత శివశంకర్, నాసా అంతర్జాతీయ కోఆర్డినేటర్ చిప్ప ప్రభాకర్, అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతల, అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ చిలువేరు పురుషోత్తం రావు, అఖిల భారత పద్మశాలి సంఘం పొలిటికల్ విభాగం జనరల్ సెక్రెటరీ సునీత, అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ డాక్టర్ సమత, కోయిలగూడెం గ్రామ సర్పంచ్ కైరం కొండ స్వప్న అశోక్, చేనేత సహకార సంఘం కొయ్యలగూడెం అధ్యక్షులు జిల్లా కోటేశ్వర్, కోయిలగూడెం ఉపసర్పంచ్ జిల్లా పవన్ కుమార్, మరియు గ్రామ వార్డు సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు

# బోడ సదర్ లాల్ పార్థివదేహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి.



తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 9: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజరపల్లి మూడు తండా గ్రామానికి చెందిన నెక్కొండ వ్యవసాయ అదనపు అధికారి వసంత మామ గారైన బోడ సదర్ లాల్ అనారోగ్యం తో మరణించగా వారి పార్థివదేహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన నర్సంపేట నియోజకవర్గ టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్,నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లావుడియా తిరుమల్, సూరిపల్లి సోసైటీ చైర్మన్ మాదటి శ్రీనివాస్ రెడ్లవాడ చైర్మన్ ఆవుల శ్రీనివాస్,రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ సోసైటీ డైరెక్టర్ మండల కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, రామాలయం డైరెక్టర్ గుంటుపల్లి ప్రభాకర్ రావు, మాజీ విద్యా కమిటీ చైర్మన్ గరికపాటి కృష్ణ రావు, ఉపసర్పంచ్ సుజాత ఎర్ర రాజు, ఒర్రె మహేశ్వరి రాజు భూక్య మౌనిక రాజ్ కుమార్ బోడ స్వాతి అనిల్ మంద ఉప్ప స్వామి సీనియర్ నాయకులు జనగాం వెంకటేశ్వర్లు భూక్య తీర్మాలు తడుగుల సాంబరాజు బాబు రమేష్ బాబు గణేష్ శంకర్ మాచర్ల భాస్కర్ రాజేష్ జగన్ సునీల్ తదితరులు పార్థివాదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# శ్రీ సోమనాథ క్షేత్రంలో ఘనంగా మహా మృత్యుంజయ యాగం

**సమృద్ధిగా వర్షాలు కురవాలి.. ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**

**లోకకళ్యాణం కోసం ప్రతినెలా మాస శివరాత్రి రోజున యజ్ఞం**



తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 9: సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ చౌటుప్పల్‌లోని శ్రీ సోమనాథ క్షేత్రంలో శ్రీ మహా మృత్యుంజయ యాగం ఘనంగా నిర్వహించారు. వేదమూర్తులైన బ్రాహ్మణోత్తముల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ యాగంలో శ్రీ సోమనాథ మహర్షి శిష్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రకృతి నుంచి సేకరించిన సమిధలతో యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.యాగం అనంతరం శ్రీ సోమనాథ మహర్షి క్షేత్రంలోని శివ లింగానికి భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం ని ర్వహించారు. మ హర్షికి హారతి స మర్పించి, సో మనాథుని మహత్యాన్ని కీర్తిస్తూ భక్తులు భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.ఈ సందర్భంగా శ్రీ సోమనాథ క్షేత్రం చౌటుప్పల్ కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ మాట్లాడుతూ.. మహర్షుల వారి ఆదేశాల మేరకు ప్రతినెలా మాస శివరాత్రి రోజున లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీ మహా మృత్యుంజయ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తితో, మనస్ఫూర్తిగా, అంకితభావంతో ఈ యజ్ఞంలో పాల్గొనే భక్తుల మనోభీష్టాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ సోమనాథ క్షేత్రం చౌటుప్పల్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పిడి రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మండలోజు సుభాష్ చంద్రచారి, కార్యదర్శి గట్టు ప్రభాకర్ గుప్తా, ఉప కార్యదర్శి చిరువెళ్ల రవీందర్, కోశాధికారి ఊరా కృష్ణమూర్తి, మహర్షుల వారి శిష్యులు, భక్తులు పాల్గొన్నారు.



# ఉప సర్పంచుల చెక్ పవర్ రద్దు చేయాలని వరంగల్ జిల్లా సర్పంచుల వినతి



తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 9:వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ సర్పంచులు అందరూ కలిసి గ్రామాల అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న, ఉప సర్పంచుల చెక్ పవర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా జాయింట్ కలెక్టర్ వినతి పత్రం అందజేశారు.గ్రామాలలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగేందుకు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు సర్పంచులకు పూర్తి స్థాయి నిర్ణయాధికారం ఉండాలని సర్పంచులు కోరారు.ఉప సర్పంచుల వల్ల కొన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, గ్రామ అభివృద్ధిని నిర్లక్ష్యం చేసే పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు.గ్రామాల అభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని వరంగల్ జిల్లా గ్రామ సర్పంచులు విజ్ఞప్తి చేశారు.

## అంగన్వాడి టీచర్ పోస్టులు దరఖాస్తు చేసుకున్న వారు సర్టిఫికెట్ వెరిఫికేషన్ సద్వినియోగపర్చుకోవాలి: సిడి పిఓ.ఎం రేష్మా

**తొలి అక్షరం/పెద్దవంగర సెప్టెంబర్ 9:** తొర్రూర్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ టీచర్ పోస్టులకు. తొర్రూర్. పెద్దవంగర. నెల్లికుదురు. మండలాలలో 29 అంగన్వాడి టీచర్ ఖాళీలకు మొత్తం 462 దరఖాస్తులు వచ్చాయి 7.09.2026 తారీకు నుండి 19.09.2026 లోపు సర్టిఫికెట్ ధ్రువీకరణకు హాజరుకావాలని సి డి పి ఓ రేష్మా పత్రికా ప్రకటనలో తెలియజేశారు

## కాళోజీ జీవితం ఆదర్శప్రాయం

- కాళోజీ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి
- బీజేపీ ములుగు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుమలత




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు), సెప్టెంబర్9:** కాళోజీ నారాయణరావు జీవితం ఆదర్శప్రాయమని, ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ ములుగు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుమలత అన్నారు. ఆయన చూపిన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజాకవి, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని సన్ రైజర్స్ హై స్కూల్‌లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుమలత,కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళోజీ తన కలం ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను, అన్యాయాలను ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం తెచ్చారని కొనియాడారు. నా గొడవ వంటి రచనల ద్వారా సమాజంలోని వాస్తవ పరిస్థితులను నిర్భయంగా ఎత్తిచూపి, సామాన్యుడి గొంతుకగా నిలిచారని తెలిపారు. పదవులు, ప్రలోభాలకు అతీతంగా నిలిచిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భవాని, స్రవంతి, శశికాంత, స్వర్ణలత, అనూష, శ్రీలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## వేయిస్తంభాల ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల

**- కరపత్రాన్ని ఆవిష్కరించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు. సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎంపీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆలయంలోని శ్రీ రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం,పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎంపీకి వేద ఆశీర్వచనం అందించారు. ఆధ్యాత్మిక,చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని,కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.అనిల్ కుమార్,ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ,మణికంఠ అవధాని,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి

**- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని సోమాజిగూడ ఆఫీస్‌లో జరిగాయి. ఈ నెల 6వ తేదీన ఆయన పుట్టినరోజు జరిగినప్పటికీ,గతంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సమయంలో ఇంచార్జిగా పనిచేసిన కాలంలో ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో ఏర్పడిన ప్రత్యేక పరిచయాల నేపథ్యంలో జూబ్లీహిల్స్ ముఖ్య నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమాజిగూడ కార్యాలయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్యనాయకులు,మహిళా నాయకులు ఆయనతో కేక్ కట్ చేయించి,బొకేలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి: ఎస్సై




**తొలి అక్షరం/మిర్యాలగూడ సెప్టెంబర్ 09:** వేములపల్లి 14వ తేదీ నుండి జరుపుకునేటటువంటి గణేష్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని వేములపల్లి ఎస్సై డి.వెంకటేశ్వర్లు గణేష్ కమిటీ సభ్యులకు మరియు ప్రజలకు తెలిపారు. బుధవారం గణేష్ కమిటీ సభ్యులకు స్థానిక పోలీస్ స్టేషన్లో సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని, అలాగే గణేష్ శోభయాత్ర సమయంలో డీజేలకు ఎలాంటి పర్మిషన్లు లేవని నిబంధనను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు.

# చౌటుప్పల్ కోర్టుకు కొత్త భవనం

**రూ. కోట్లతో అధునాతన సౌకర్యాలు.. మోడల్ స్కూల్ ఎదురుగా 5 ఎకరాల్లో నిర్మాణం**

**రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్**




**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 9:** చౌటుప్పల్‌లో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్కారం పరిధిలోని మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 50లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నూతన కోర్టు భవనాన్ని అధునాతన హంగులతో నిర్మించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను రాబోయే రెండు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక ప్రాంతంగా చౌటుప్పల్ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల న్యాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ఇక్కడ ఇండస్ట్రియల్ కోర్టుతో పాటు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామని పరమేష్ పేర్కొన్నారు. నూతన కోర్టు భవనానికి పరిపాలనా అనుమతులు సాధించడంలో సహకరించిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అదనపు కోర్టు భవన సాధనకు కృషి చేసిన బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎలమోని శ్రీనివాస్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, బాల్యం వెంకట చలపతిలను అభినందించారు. **న్యాయవాదుల్లో హర్షం** నూతన కోర్టు భవన నిర్మాణానికి అనుమతులు లభించడంపై జూనియర్ ఇన్‌చార్జి సివిల్ జడ్జి శిరీష, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. పరస్పరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అనుమతుల సాధనకు నిరంతరం కృషి చేసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్‌ను న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పిట్టల భిక్షం, జాయింట్ సెక్రటరీ మక్తాల నరసింహ, కోశాధికారి స్వాతి, లైబ్రరీ సెక్రెటరీ నర్రి స్వామి, సీనియర్ న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, రాపోలు వేణు, చామట్ల జంగయ్య, జిల్లా రమేష్, దేశబోయిన శ్రీశైలం, మహమ్మద్ ఖయ్యూం, కిరణ్, నకిరేకంటి జ్యోతి, పిట్టల భరత్ తదితరులు పాల్గొన్నారు.

# భూదానం.. భక్తి చాటిన కంచరకుంట్ల కుటుంబం

**రూ.15 లక్షల విలువైన స్థలాన్ని వినాయక మండపానికి విరాళంగా అందజేత**

**మండపాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొగుదల పావని**







**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 9:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని కంచరకుంట్ల కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మున్సిపల్ చైర్మన్ మొగుదల పావని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పావని మాట్లాడుతూ.. వినాయక మండపం ఏర్పాటుకు రూ. 15 లక్షల విలువైన స్థలాన్ని విరాళంగా అందించడంతో పాటు మండప నిర్మాణాన్ని చేపట్టిన కంచరకుంట్ల సత్తిరెడ్డిజానకమ్మ దంపతులను అభినందించారు. భూదానం చేసిన వారి కుటుంబంపై వినాయకుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాలు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కాలనీవాసులు చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లోనే అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్థానిక కౌన్సిలర్ పాక చిరంజీవి మాట్లాడుతూ.. కంచరకుంట్ల కుటుంబం చేసిన భూదానం అభినందనీయమన్నారు. భూదాత కుటుంబానికి ఎల్లప్పుడూ మంచి జరగాలని ఆకాంక్షించారు. కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. చౌటుప్పల్‌లో వెనుకబడిన కాలనీల్లో ఒకటిగా ఉన్న కంచరకుంట్ల కాలనీ అభివృద్ధి కోసం కాలనీవాసులందరూ ఒక సంఘంగా ఏర్పడి, తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనరెడ్డి కంచరకుంట్ల కాలనీలో మొక్కలు నాటారు. **కమ్యూనిటీ హాల్‌కు 400 గజాల స్థలం విరాళం** కంచరకుంట్ల సత్తిరెడ్డి మాట్లాడుతూ.. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన 400 గజాల సొంత స్థలాన్ని విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. దీంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల విప్లవ్, చింతల ఉమామహేశ్వరి, ఎస్కే జానీబాబు, తాడూరి పరమేష్ పాల్గొన్నారు.

# షాద్ నగర్ మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ వాలీబాల్ క్రీడ ఎంపికలు



**350 మంది విద్యార్థుల క్రీడా ప్రతిభకు పరీక్ష**

**ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ మండల స్థాయి వాలీబాల్ పోటీలు**

**విద్యాశాఖ అధికారి (ఎంఈవో) టి. మనోహర్ క్రీడా పోటీలను ప్రారంభించారు**

**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 09:** ఫరూక్‌నగర్ మండలంలోని షాద్ నగర్ మినీ స్టేడియంలో 70వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి బాలబాలికల వాలీబాల్ క్రీడా ఎంపికలు బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) టి. మనోహర్ ప్రారంభించారు. అండర్-14 బాలికల విభాగంలో ప్రథమ బాగామతి TGWRS కమ్మదనం ద్వితీయ బహుమతి వీజీప మొగిలిగిద్ద, అండర్ 14 బాలుల విభాగంలో ప్రథమ బహుమతి ఇండియన్ హైట్స్ పాఠశాల కిషన్ నగర్, ద్వితీయ బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ బాయ్స్ షాద్ నగర్, 17 బాలికల విభాగం ప్రథమ బహుమతి ఎం జె పి మొగలిగిద్ద, ద్వితీయ బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ చించోడు, 17 బాలుల విభాగంలో ప్రథమ బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ చించోడు, ద్వితీయ బహుమతి సత్య సాయి పాఠశాల షాద్ నగర్ సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొని వివిధ క్రీడాంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. మండలంలోని ప్రభుత్వ, జడ్పీహెచ్ఎస్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యా ర్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు అవసరమైన సహకారం అందించారు. జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ నలిని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫరూక్‌నగర్ హెచ్ఎం డా. వి. రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఏ. రాజశేఖర్‌రెడ్డి, జోనల్ కార్యదర్శి వి. బాలయ్య, డీడీ సల్మాన్‌రాజు, ఇండియన్ హైట్స్ పాఠశాల ప్రిన్సిపల్ సునీత, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

వివిధ క్రీడాంశాల్లో విజయం సాధించిన క్రీడాకారులకు ఎంఈవో టి. మనోహర్ చేతుల మీదుగా బహుమతులు అందజే శారు. విజేతలను అభినందించిన ఆయన, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచిం చారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశి క్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.

# టెస్ట్ ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపికైన కిట్స్ వరంగల్ విద్యార్థులు

**హైదరాబాద్‌కు చెందిన బహుళజాతి యథ్వా ఎనర్జీ సొల్యూషన్స్ కంపెనీలో ఎంపిక**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** 03 సెప్టెంబర్ 2026న నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా 'యథ్వా ఎనర్జీ సొల్యూషన్స్ 'టెస్ట్ ఇంజనీర్' ఉద్యోగానికి ఎంపికైన ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ ) విభాగపు ఏడుగురు బి.టెక్ చివరి సంవత్సరం విద్యార్థులను కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ (కిట్స్ వరంగల్ ) గర్వంగా అభినందిస్తోంది.ఎంపికైన 2026-2027 విద్యా సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో కోర్‌ఇంజనీరింగ్ విద్యార్థులు అకుల నాగరాణి,పోల రాహుల్,బొడ్డుల నీరజ్,నాగుల నీరజ్,కొత్త భగవాన్ రెడ్డి,సోమ చంద్ర తేజ్,తుమ్మ మణి రిత్విక్ అని ఫార్మర్ రాజ్యసభ,యం.పి.,కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు,చైర్మన్,కిట్స్ వరంగల్ ఒక ప్రెస్ నోట్‌లో తెలిపారు.కిట్స్ వరంగల్ కోశాధికారి పి.నారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం,ఈ విజయం విద్యార్థుల అంకితభావం,సాంకేతిక సామర్థ్యాలు,పరిశ్రమలో అర్థవంతమైన అవకాశాలను కల్పించేందుకు సంస్థ చేస్తున్న నిరంతర కృషిని ప్రతిబింబిస్తుంది.రాబోయే రోజుల్లో కిట్స్ ప్రాంగణ నియామకాల నిర్వహణకు సాంకేతిక ప్రపంచ దిగ్గజ యమ్.యన్.సి.కంపెనీలు సంసిద్ధత వ్యక్తం విద్యార్థినీ విద్యార్థుల కు సగర్వంగా హైలైట్ చేశారు.క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లను నిర్వహించడానికి అనేక కంపెనీలు పైప్‌లైన్‌లో ఉన్నాయి అని తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు ఎల్లవేళలా తమ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నెమరు వేసుకుంటూ ఉద్యోగ సముపార్జన లో నిమగ్నము కావాలని కోరారు.ఈ యథ్వా ఎనర్జీ కంపెనీ వారు వ్రాత పరీక్ష,టెక్నికల్ రౌండ్ & ఇంటర్వ్యూ రౌండ్ లను విజయవంతంగా 3 దశలలో నిర్వహించారు.ప్రస్తుత బి.టెక్.చివరి సంవత్సరం విద్యార్థులు ఇంటర్వ్యూలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.అధిక సిటిసి తో ప్లేస్‌మెంట్‌లను పొందడానికి స్థిరమైన అభ్యాసం,అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యంఅని సగర్వంగా తెలిపారు.కిట్స్ కళాశాల యాజమాన్యం సభ్యులు,ఫార్మర్ రాజ్యసభ,యం.పి,కిట్స్ చైర్మన్,కెప్టెన్ వి.లక్ష్మీకాంతా రావు,కోశాధికారి పి. నారాయణ రెడ్డి,హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే,వి.సతీష్ కుమార్,ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి,డీన్ ట్రైనింగ్ & ప్లేస్ మెంట్స్ ప్రొఫెసర్ వై.పురందర్,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్ రెడ్డి,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి.రమేష్ రెడ్డి, ఈఈఈ విభాగాదిపతి, డాక్టర్ ఎం.నరసింహారావు,టి.పి.ఓ.డా.సి హెచ్.సతీష్ చంద్ర,కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ ఇ.కిరణ్ కుమార్,వివిధ విభాగాల డీన్స్,విభాగాదిపతులు మరియు కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ పి.ఆర్.ఓ.డా.డి.ప్రభాకరా చారి,అప్టిట్యూడ్ ట్రైనర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్లు,డాక్టర్ పవన్,జి.ధనుష్,డి.శరత్, పి.సింధూర,వివిధ విభాగాల హెడ్‌లు,అందరు డీన్‌లు, పలువురు బోధన,బోధనేతర సిబ్బంది ఎంపికైన 7 విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# శాయంపేటలో పలు పాఠశాలలను ఆకస్మిక పరిశీలన

**• జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ వి రాజు గౌడ్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ జిల్లాలోని శాయంపేట మండలంలో నాలుగు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ వి రాజు గౌడ్ ఆకస్మిక పరిశీలన చేశారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పత్తిపాక,శాయంపేట (బాలికలు),మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు పత్తిపాక,శాయంపేట లలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తరగతి గదిలో ప్రశ్నించడం ద్వారా రాబట్టారు.మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు.పత్తిపాక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కేవలము 22 మాత్రమే ఉండటం వల్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.పాఠశాలలో విద్యా కార్యక్రమాలు నిరంతరము చేపట్టి విద్యార్థుల సంఖ్యని పెంచాల్సిందిగా ప్రధానోపాధ్యాయురాలు మాధవిని ఆదేశించారు.విద్యార్థుల సామర్థ్యాలు కూడా తక్కువగా ఉండడాన్ని గమనించారు.మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శాయంపేటలో ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరస్ కాంటినెంట్ స్కూల్ గా ఎంపిక అయినందున ఎఫ్ ఎల్ ఎన్ లో సామర్థ్యాలను పరిశీలించారు.విద్యార్థులు జవాబులు చక్కగా ఇచ్చారు.తరగతి గదిలో విద్యార్థుల విద్య సామర్థ్యాలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ బండారి మన్మోహన్ పరిశీలించారు.పాఠశాలలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వసతులను ముఖ హాజరును జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ బి మహేష్ పరిశీలించారు.

# అన్నదాతకు అండగా ఉన్న రైతుబీమాను బంద్ పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ఎనిమిదేళ్లుగా రైతు కుటుంబాలకు రూ.5 లక్షల భరోసా కల్పించిన పథకాన్ని నిలిపివేయడం దుర్మార్గం: ఢిల్లీ మాధవ రెడ్డి**



**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 9:** అన్నదాత కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలిచిన రైతుబీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమని టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, చౌటుప్పల్ మండలానికి చెందిన ఢిల్లీ మాధవ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతుబీమా పథకం ద్వారా రైతు కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ పథకాన్ని అర్ధాంతరంగా నిలిపివేయడంతో రైతు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన 45 ఏళ్ల దళిత రైతు ఒర్సు రాంచందర్ గత నెల 29న గుండెపోటుతో మృతి చెందడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. రాంచందర్‌కు అర ఎకరం వ్యవసాయ భూమితో పాటు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని, కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో రూ.5 లక్షల రైతుబీమా వస్తుందనే ఆశతో ఆయన మిత్రులు స్థానిక ఏఈఓను సంప్రదించగా, ఆగస్టు 14 నుంచి రైతుబీమా పథకం నిలిచిపోయిందని, బీమా క్లెయిమ్ వర్తించదని అధికారులు చెప్పడం బాధాకరమన్నారు.కుటుంబానికి ఆపద సమయంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక భరోసా నిలిచిపోవడంతో రాంచందర్ కుటుంబం తీవ్ర నిరాశకు గురైందని ఢిల్లీ మాధవ రెడ్డి పేర్కొన్నారు.2018 ఆగస్టు 15న రైతుబీమా పథకాన్ని ప్రారంభించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, రైతు పేరిట కనీసం గుంట వ్యవసాయ భూమి ఉన్నా రైతుబీమా వర్తించే విధంగా ఈ పథకాన్ని రూపొందించారని గుర్తుచేశారు. రైతు ఏ కారణంతో మరణించినా, ఆయన కుటుంబానికి రూ.5 లక్షల బీమా మొత్తాన్ని అందించేలా పథకాన్ని అమలు చేశారని తెలిపారు.201819 నుంచి 202526 వరకు 1,86,363 మంది రైతులు మృతి చెందగా, వారి కుటుంబాలకు మొత్తం రూ.9,107.80 కోట్ల పరిహారం అందించబడిందని తెలిపారు. అలాగే రైతుబీమా పథకం పరిధిలో సుమారు 42.16 లక్షల మంది రైతుల కోసం ఏటా దాదాపు రూ.1,400 కోట్ల వరకు ప్రీమియం చెల్లిస్తూ ప్రభుత్వం పథకాన్ని కొనసాగించిందని పేర్కొన్నారు.రైతు కుటుంబాలకు అత్యవసర సమయంలో ఆర్థిక భరోసా కల్పించే రైతుబీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలని, అర్హులైన రైతు కుటుంబాలకు బీమా ప్రయోజనం అందించాలని ఢిల్లీ మాధవ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**- విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం పరిశీలన**



**తొలిఅక్షరం/కేసముద్రం సెప్టెంబర్ 8:** కేసముద్రం మండలంలోని కోరుకొండపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ స్నేహ శబరిష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ బోధన అందించాలని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ చిన్నారుల హాజరు, పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తూ వారి శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. కేంద్రాల్లో సేవల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు.

# ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫర్ వేస్ట్ వాటర్ టెక్నాలజీ

**- ఇండియా2026లో పాల్గొననున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్లో సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న 13వ (ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫర్ వేస్ట్ వాటర్ టెక్నాలజీ) ఇండియా 2026లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ.వెంకన్న పాల్గొననున్నారు.తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఎంపికైన మున్సిపల్ కమిషనర్లు,సీనియర్ అధికారులతో కూడిన ప్రతినిధి బృందంలో భాగంగా కమిషనర్ వెంకన్న ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.పట్టణ నీటి నిర్వహణ,మురుగునీటి శుద్ధి,ఘన వ్యర్థాల నిర్వహణ,రీసైక్లింగ్,బయోగ్యాస్,ఈ-వేస్ట్ తదితర ఆధునిక పర్యావరణ సాంకేతికతలపై నిర్వహించే ప్రదర్శనలు,సాంకేతిక సమావేశాలు,నిపుణులతో చర్చలు,జ్ఞాన మార్పిడి కార్యక్రమాల్లో కమిషనర్ వెంకన్న పాల్గొననున్నారు.ఈ కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతలు,ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి వరంగల్ నగరంలో పారిశుధ్యం,ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఉపయోగపడనున్నాయి.

# షాద్‌నగర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

**• కాళోజీ సాహిత్య సేవలను స్మరించుకున్న విద్యార్థులు**



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్09:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాళోజీ బాల్యం, విద్యాభ్యాసం, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను వివరించారు. 'నా గొడవ'లోని కవితలను ఆలపిస్తూ కాళోజీ సాహిత్య సేవలను కొనియాడారు. తెలుగు అధ్యాపకులు డా. ఎస్. రవి ప్రసాద్ మాట్లాడుతూ వేమన తర్వాత ప్రజాకవిగా కాళోజీ విశిష్ట గుర్తింపు పొందారని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసులు తెలంగాణ యాసలోని మాధుర్యాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ డా. ఎల్. కమల మాట్లాడుతూ కాళోజీ జీవితం సమాజం, దేశం కోసం అంకితమైందని పేర్కొన్నారు. విద్యార్థులు తెలుగు భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తృత్వం, వ్యాసరచన పోటీల విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

# మండల స్థాయి బాలబాలికల టోర్నమెంటు

**- ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కమలాపూర్ మండల కేంద్రంలోని బాయ్స్ హై స్కూల్లో నిర్వహించిన మండల స్థాయి బాలబాలికల టోర్నమెంటు ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ ప్రారంభించారు.కబడ్డీ,కోకో, క్రీడలను ప్రారంభించిన అనంతరం ఝాన్సీ రాణి మాట్లాడుతూ ,చదువుతోపాటు క్రీడలకు కూడా విద్యార్థినీ విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని,సెల్ ఫోన్ లకు బానిసలు కావద్దని,వ్యసనాలకు దూరంగా ఉండాలని,క్రీడలతో మానసిక ఉల్లాసమే కాకుండా శారీరక దృఢత్వం ఏర్పడుతుందని తెలుపనైనది. స్థానిక సీఐ నవీన్,ఎస్సై దిలీప్,సర్పంచ్ పబ్బు సతీష్,ఉప సర్పంచ్ పుల్లశ్రీనివాస్,ప్రధానోపాధ్యాయులు శివకుమార్,మండలంలోని పిఈటిలు,విద్యార్థి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# దళిత నాయకుడు మహంకాళి మల్లయ్య మృతి



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 9:** ప్రముఖఅంబేద్కర్ వాది దళిత బహుజన ఉద్యమ నాయకుడు మహంకాళి మల్లయ్య అకాల మృతి దళితులకు తీరనిలోటని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ తప్పెట్ల వీరన్న అన్నారు. మృతుడు మల్లయ్య తో వీరన్న కలిసి పయనించిన సందర్భాలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ అంబేద్కర్ సంఘం నేనున్నాను అని ముందు నడిచిన మా అన్న మహంకాళి మల్లయ్య తొర్రూర్ మండలం మడిపల్లి గ్రామం అయినా మహబూబాబాద్ లో దళిత ఉద్యమాలలో తన మార్కును చూపించుకుంటూ పేద దళితుల కోసం తన వంతు పాత్రను పోషించి, ఇక చాలు ఈ జీవితానికి అంటూ విశ్రాంతి తీసుకున్న మా పెద్దన్నకు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ మరియు తెలంగాణ రాష్ట్ర కమిటీ, తొర్రూరు డివిజన్ కమిటీ అన్ని మండల కమిటీలు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారికి శిరస్సు వంచి నమస్కరిస్తూ జై భీమ్ తెలియజేస్తూ రేపు తొర్రూరు పక్కన మడిపల్లి గ్రామంలో 12 గంటలకు అంత్యక్రియలు కార్యక్రమం ఉన్నది అందరూ తప్పక హాజరై మహంకాళి మల్లన్నకు నివాళులర్పించాలని కోరుచున్నాము వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారు చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ వారికి కడసారి వీడుకోలు పలకటానికి అందరూ హాజరు కావాలని తెలిపారు. ,, తప్పట్ల వీరన్న రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం,, కామ సంజీవరావు, జిల్లా అధ్యక్షులు మహబూబాబాద్ తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం,, నీరుడు సామేలు జిల్లా ప్రధాన కార్యదర్శి మహబూబాబాద్ తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తమ సంతాపాన్ని తెలిపారు.

# ఉప సర్పంచ్ల చెక్ పవర్ రద్దు చేయాలి...

**- కలెక్టరేట్ ముట్టడించిన 130 మంది సర్పంచులు**

**తొలి అక్షరం/ములుగు సెప్టెంబర్ 9:** ములుగు జిల్లా కేంద్రంలో మంగళవారం సర్పంచుల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటం జరిగింది. జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ ముష్నేపల్లి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని 9 మండలాలకు చెందిన సుమారు 130 మంది సర్పంచులు ఏకతాటిపైకి వచ్చి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు

.ఈ సందర్భంగా ఉప సర్పంచులకు ఉన్న చెక్ పవర్ ను వెంటనే రద్దు చేసి గ్రామ పంచాయతీల పరిపాలనలో సర్పంచుల అధికారాలను బలోపేతం చేయాలని కోరుతూ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.

గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన అందించాలంటే సర్పంచులకు పూర్తి బాధ్యతతో పాటు తగిన అధికారాలు ఉండాలని ఫోరం స్పష్టం చేసింది. ఈ సమస్యను త్వరలో మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కుమార్ గౌడ్ తెలిపారు.

# కంఫర్ట్ ఐపీఎస్ పుల్ల కరుణాకర్‌ను సన్మానించిన ఒడితెల ప్రణవ్ బాబు

**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి :** కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలో కంఫర్ట్ ఐపీఎస్ పుల్ల కరుణాకర్ ను ఒడితెల ప్రణవ్ బాబు సన్మానించారు.కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ పుల్ల కరుణాకర్ కు కాన్ఫర్డ్ ఐ పి ఎస్ హోదా లభించిన సందర్భంగా అభినందించిన టిపిసిసి ఓబిసి కోఆర్డినేటర్ తౌటం రవీందర్,హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాబు అనంతరం కమలాపూర్ లో దాసి శంకరయ్యకు చెందిన టింబర్ డిపో, మిట్టపల్లి ప్రభాకర్ కు చెందిన ఎలక్ట్రికల్ షాపులను ప్రారంభించారు.తదనంతరం అంబాల మాజీ సర్పంచి కెత్తే రవి తండ్రి మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షులు వాసాల శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి, బాలసాని రమేష్,మాట్ల రమేష్, ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్,విష్ణుదాసు వంశీధర్ రావు,కెత్తే విజయేం దర్,గూడెపు మొగిలయ్య,నాంపల్లి ప్రభాకర్,మనీష్,పుల్ల శోభన్,గాలిబు నవీన్,జేరిపోతుల బిక్షపతి,తాటిపాముల రాములు,అంకతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బిడ్డల పాదముద్రలను పసుపు నీళ్లతో కడిగిన కేసీఆర్ - దళితులంటే అంత చిన్నచూపా?

**● నోముల ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు**



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 9:** నిన్న డప్పు చప్పుళ్లతో, ఆత్మగౌరవ నినాదాలతో కేసీఆర్ ఫామ్ హౌస్ వైపు కదిలిన దళిత జాతి బిడ్డల పాదముద్రలను ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో పసుపు నీళ్లతో కడిగారనే వార్త రాష్ట్రవ్యాప్తంగా దళిత సమాజంలో ఆగ్రహ జ్వాలలు రేపుతోంది.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన దళిత వ్యతిరేక వ్యాఖ్యలకు నిరసనగా, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు, కాంగ్రెస్ శ్రేణులు నిన్న ఎర్రవెల్లి ఫామ్ హౌస్ పైకి దండెత్తారు. పోలీసులు వారిని అడ్డుకున్నా, డప్పులతో, నినాదాలతో తమ ఆవేదనను వినిపించారు.అయితే ఆ దళిత బిడ్డలు వెనుదిరిగిన వెంటనే, వారి పాదముద్రలు పడిన చోట పసుపు నీళ్లతో కడిగినట్లుగా వస్తున్న వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది నిజమైతే ఇంతకంటే దారుణం, ఇంతకంటే అవమానం మరొకటి ఉండదని దళిత మేధావులు మండిపడుతున్నారు.తెలంగాణ తెచ్చింది దళితులమే, కొట్లాడింది మేమే అని చెప్పుకునే కేసీఆర్, దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని మాట ఇచ్చి, దళితబంధు పేరుతో మోసం చేసి, ఇప్పుడు ఏకంగా దళితుల పాదముద్రలను పసుపు నీళ్లతో కడిగే స్థాయికి దిగజారాడా? అని ప్రశ్నిస్తున్నారు.ఇది కేవలం పసుపు నీళ్లతో కడగడం కాదు, తెలంగాణలోని 30 లక్షల దళిత కుటుంబాల ఆత్మగౌరవాన్ని కడిగేయడమేనని, దళితులంటే కేసీఆర్ కు ఎంత చిన్నచూపో ఈ ఘటనతో మరోసారి బయటపడిందని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై కేసీఆర్, కేటీఆర్ లు వెంటనే దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీఎస్సీ సెల్ జిల్లా నాయకులు నోముల ప్రవీణ్ తెలిపినారు

# డిజిటల్ క్రాప్ సర్వేలో దొడ్డి దారి నియామకాలు

**● కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు భగ్గుమన్న బీఆర్ఎస్**

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 9:** రామన్నపేట మండలంలో డిజిటల్ క్రాప్ సర్వే నియామకాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ దందా బయటపడింది. 21 గ్రామాలకు 21 మంది సర్వేయర్లను ఎంపిక చేస్తూ విడుదల చేసిన లిస్టులో ఒక్క సర్పంచుకు కూడా సమాచారం ఇవ్వలేదంటే, ఈ ప్రభుత్వానికి గ్రామ పంచాయతీలంటే ఎంత చులకన భావమో అర్థమవుతోందని బీఆర్ఎస్ కు చెందిన సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో పంటలపై అవగాహన ఉన్న, చదువుకున్న నిరుద్యోగ యువతను కాదని, కేవలం కాంగ్రెస్ జెండా మోసిన వారికే, కాంగ్రెస్ నాయకుల సిఫార్సుతో వచ్చిన వారికే ఉద్యోగాలు కట్టబెట్టారని మండిపడుతున్నారు. సర్పంచ్ లు అంటే గ్రామానికి పెద్ద దిక్కు, కానీ వారిని పక్కన పెట్టి అర్ధరాత్రి లిస్టులు తయారు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని విమర్శిస్తున్నారు.ఇది రైతు సర్వే కాదు, కాంగ్రెస్ కార్యకర్తల పోషణ పథకమని, ఈ దొడ్డిదారి నియామకాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సర్పంచులు స్పష్టం చేశారు. వెంటనే ఈ జాబితాను రద్దు చేసి, ప్రతి గ్రామంలో గ్రామసభ పెట్టి, సర్పంచుల సమక్షంలో అర్హులైన స్థానిక యువతను పారదర్శకంగా ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే అందరు సర్పంచులు కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

**వివరణ:** ఎంఏవో ఎజాజ్ అలీ ఖాన్: నియామకాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరిగాయి. స్థానిక అర్హులైన యువతనే తీసుకున్నాం. రాజకీయ జోక్యం లేదు."ఎమ్మార్వో లాల్ బహదూర్ శాస్త్రి:"సర్వే రైతుల కోసమే. ఎంపిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిబంధనల మేరకే జరిగింది. ఆరోపణల్లో వాస్తవం లేదు."

# తెలంగాణ సాధకుడి పట్ల కాంగ్రెస్ నేతల తీరు తీవ్రంగా ఖండనీయం

**రాష్ట్రం కోసం సుదీర్ఘ పోరాటం చేసిన తొలి ముఖ్యమంత్రిని గౌరవించడం నేర్చుకోవాలి**

**సుర్కంటి శ్రీధర్ రెడ్డి మందోల్లగూడెం గ్రామ ఉపసర్పంచ్, ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు**



**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 9:** ఎన్నో సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసి, తెలంగాణ ప్రజలను సంఘటితం చేసి, ఐక్యమత్యంతో ఉద్యమాన్ని ముందుకు నడిపించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగం, ఉద్యమ నాయకత్వాన్ని చరిత్ర ఎప్పటికీ మరచిపోదు.తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారి పట్ల కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా బాధాకరమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఖండిస్తున్నాం.రాజకీయంగా ఎవరికి ఎలాంటి అభిప్రాయాలు ఉన్నప్పటికీ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా శ్రీ కేసీఆర్ గారికి కనీస గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉంది.తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిని అవమానించడం ద్వారా తెలంగాణ సమాజం మనోభావాలను దెబ్బతీయవద్దని కాంగ్రెస్ నాయకులను హెచ్చరిస్తున్నాం. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత స్థాయిలో అవమానకరంగా మాట్లాడటం మాత్రం ఏ విధంగానూ సమర్థనీయం కాదు.తెలంగాణ సాధనలో కేసీఆర్ గారి పాత్రను తక్కువ చేసి చూపడం సాధ్యం కాదు. ఆయన పట్ల జరిగిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

# లక్ష్మీపతి మృత్యానికి నివాళులర్పించిన సీఐ అంజలి


**- కుటుంబానికి రూ. 30,000 తక్షణ ఆర్థిక సాయం**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 9:** హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీపతి మృత్యానికి పూలమాలవేసి పట్టణ ఇంచార్జ్ సిఐ అంజలి నివాళులర్పించారు.పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ, అనారోగ్యంతో అకాల మృతి చెందగ బుధవారం మృతుడి హెడ్ కానిస్టేబుల్ (హెచ్.సి 1434) బి. లక్ష్మీపతి ఇంటికి వెళ్లి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆయన కుటుంబానికి రూ. 30,000 తక్షణ ఆర్థిక సహాయం అందించారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ అసోసియేషన్ వెల్ఫేర్ నిధుల నుండి ఈ మొత్తాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.మహబూబాబాద్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాం శేఖర్ ఆధ్వర్యంలో ఈ సాయాన్ని అందించడం జరిగింది. లక్ష్మీపతి మృతి పోలీస్ శాఖకు తీరని లోటని, వారి సేవలు మరవలేనివని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బాదే రామయ్య, ఆర్గనైజేషన్ సెక్రటరీ దిడ్డి అనిల్, ఈసీ మెంబర్ కోడిశాల సురేష్ , ఎస్ఐలు ఉమ, సూరయ్య తదితర పోలీస్ అధికారులు , మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# కత్తి శంకరమ్మ దశదినకర్మలో ఘన నివాళులు

**- శంకరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి**



**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్09:** బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ తల్లి కత్తి శంకరమ్మ దశదినకర్మ కార్యక్రమం షాద్నగర్ పట్టణం భాగ్యనగర్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేశంపేట్ మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి హాజరై, కత్తి శంకరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా శంకరమ్మ సేవలను స్మరించుకున్నారు. ఆమె మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో బంధువులు, సన్నిహితులు, బీసీ సేన నాయకులు, కాలనీ కౌన్సిలర్ సంతోష్ బాయ్ చందులాల్ పాల్గొని ఆమెకు నివాళులర్పించారు.

# అధిక ధరలకు యూరియా విక్రయాలు

**తొలి అక్షరం/దంతాలపల్లి సెప్టెంబర్ 9:** దంతాలపల్లి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు యూరియాతో పాటు ఇతర పురుగుల మందులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని దుకాణం దారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన రైతు ఏరియాను అధిక ధరలకు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు అధికారులు విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు

# రామన్నపేటలో వెంగమాంబ ఆర్యవైశ్య టిఫిన్ సెంటర్ గ్రాండ్ ఓపెనింగ్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 9:** రామన్నపేట పాత బస్టాండ్ దగ్గర వెంగమాంబ ఆర్యవైశ్య టిఫిన్ సెంటర్ ఘనంగా ప్రారంభం అయిందిప్రొప్రైటర్ బి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ టిఫిన్ సెంటర్ లో రుచికరమైన ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, వడ తో పాటు భోజన సదుపాయం కూడా కలదు. వివాహాది శుభకార్యములకు క్యాటరింగ్ సదుపాయం కలదని నిర్వాహకులు తెలిపారు.రుచికరమైన భోజనం, నాణ్యమైన వంటకాలు తమ ప్రత్యేకత అని, రామన్నపేట ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా తెలంగాణ మాతృభాష దినోత్సవం

**- తెలుగు భాష గొప్పతనాన్ని చాటిన కృష్ణవేణి విద్యార్థులు**





**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్09:** షాద్నగర్ పట్టణం భాగ్యనగర్ కాలనీలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థినీ, విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, తెలుగు సామెతలు, పొడుపుకథలు, పద్యాల ద్వారా తెలుగుతనాన్ని చాటారు. అత్యధిక తెలుగు పద్యాలు వల్లెవేసిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రఫత్ సుల్తానా బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాళోజీ ప్రజా సమస్యలపై తన కలంతో పోరాడిన ప్రజాకవి అని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఇంట్లో కుటుంబ సభ్యులతో తెలుగులో మాట్లాడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండల స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ ఘనంగా ప్రారంభం



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 9:** రామన్నపేట మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ సెలక్షన్స్ జెడ్ పి హెచ్ ఎస్ ఇంద్రపాలనగరం పాఠశాలలో విజయవంతంగా జరిగాయి.ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాసు విక్రమ్ , ఎంఈఓ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. క్రీడాకారులను ఉద్దేశించి సర్పంచ్ విక్రమ్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో రామన్నపేట మండలం ప్రథమ స్థానంలో నిలవాలని, రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు రెండు రోజుల పాటు భోజన సదుపాయం కల్పించారు.ఈ సందర్భంగా ఆయనకు మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే. శేఖర్ , బిఆర్ఎస్ నాయకులు మందడి శ్రీధర్ రెడ్డి , పి ఈ టి లు పెద్దబోయిన మణి, సరోజ, రేణుక, కొండ సాయి, చందు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మారేపల్లి



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 9:** రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన డాక్టర్ వీరమల్ల లింగస్వామి, తల్లి దేవమ్మ దశదినకర్మకు హాజరైన సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి లింగస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తీరుపాల ఐలయ్య, గోపగోని శ్రీనివాస్, గోపగోని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# శోభనాద్రిపురంలో ఉచిత కరాటే శిక్షణ

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 9:** రామన్నపేట మండలంఎంపీ యుపిఎస్ శోభనాద్రిపురం, పూలే-అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ. ప్రైవేట్, ప్రభుత్వ విద్యార్థులకు అవకాశం. పూర్తయ్యాక ఉచిత యూనిఫాం, సర్టిఫికెట్ ఇస్తారు. హెడ్మాస్టర్ గడ్డం శ్రీనివాస్ రెడ్డి పత్రికా తెలిపినారు

# ప్రధమ వర్ధంతి అల్లం సాయికుమార్



**తొలి అక్షరం/దంతాలపల్లి సెప్టెంబర్ 9:** దంతాలపల్లి మండల కేంద్రంలోని బిజెపి కార్యకర్త అల్లం సాయికుమార్ విగ్రహ విష్కరణ జరపడం జరిగింది పార్టీ కార్యకర్తలు. బానోతు ప్రభాస్ నాయక్ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ డోర్నకల్ కాన్సెన్సీ మండల పార్టీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# విలేఖరి తండ్రి మృతికి కాంగ్రెస్ నేత ధైద రవీందర్ నివాళి



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 9:** చెరువుఅన్నారం విలేఖరి గడగోజు రవీంద్రాచారి తండ్రి యాదయ్యచారి మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సైదులు, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



# భక్తి, క్రమశిక్షణ, భద్రతతో గణపతి నవరాత్రులను జరుపుకోవాలి




తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 9: గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తి క్రమశిక్షణతో, భద్రతతో జరుపుకోవాలని పురపాలక సంఘ చైర్పర్సన్ గుగులోత్ జ్యోతి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో పోలీసు శాఖ వారు నిర్వహించిన గణపతి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ముందస్తు జాగ్రత్తల గురించి ఈ యొక్క కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న పురపాలక సంఘ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తులందరూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీస్ శాఖ సూచించింది. గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు పాటిస్తూ, విద్యుత్ తీగలు మరియు అగ్ని ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అదేవిధంగా మండపాల వద్ద అధిక శబ్దంతో డీజేలు, లౌడ్స్పీకర్లు ఉపయోగించకుండా నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చూడాలని తెలిపారు. నిమజ్జనం సమయంలో నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు అదేవిధంగా పోలీస్ శాఖ వారు నిరంతరం ఈ యొక్క మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక పర్యవేక్షణ ముమ్మరం చేస్తూ ఉండాలని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని దిశ నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు డి.ఎస్.పి తిరుపతిరావు, సిఐ అంజలి,ా× లు వార్డుల కౌన్సిలర్లు, బొల్లు రాజు, నీరుటి లక్ష్మీ నారాయణ, చిదిరాల జ్ఞానేశ్వర్, పద్మం ప్రవీణ్, నిమ్మల శ్రీను, గణపతి ఉత్సవాల నిర్వాహక కమిటీ సభ్యులు, పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వానికి రూపునిచ్చే బ్రహ్మలు.. సమాజానికి దర్పణం పట్టే పాత్రికేయులు!

- విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీలు ఏర్పాటు
- వరంగల్ అధ్యక్షుడిగా కుంటమల్ల అరవింద్, హనుమకొండ అధ్యక్షుడిగా ఉల్లి వెంకటేశ్వర్లు
- జర్నలిస్టుల సంక్షేమానికి సమిష్టిగా కృషి చేయాలి: రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తూములూరి సత్యనారాయణ



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 9: వరంగల్, సృష్టికి మూలమైన విశ్వబ్రాహ్మణుడు తన నైపుణ్యంతో జగత్తుకు రూపాన్ని ఇస్తే.. వర్తమాన సంఘటనలను వార్తలుగా మలిచే జర్నలిస్ట్ సమాజానికి దర్పణంగా నిలుస్తాడు. ఈ రెండు రంగాల్లో ఉన్న శ్రమజీవుల ఐక్యత, సంక్షేమం ధ్యేయంగా తెలంగాణ విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాలకు నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వరంగల్ నగరంలోని భద్రకాళి రోడ్డులో ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కుంటమల్ల అరవింద్, ప్రధాన కార్యదర్శిగా మునిగంటి అమరేంద్ర చారి ఎంపికయ్యారు. హనుమకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఉల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా దించనాల రాజులను ఎన్నుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తూములూరి సత్యనారాయణ, ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్ నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. తూములూరి సత్యనారాయణ మాట్లాడుతూ పాత్రికేయుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమానికి అసోసియేషన్ నిరంతరం ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. కొత్తగా ఎన్నికైన జిల్లా కమిటీల నాయకులు సమిష్టిగా పనిచేస్తూ, స్థానిక సమస్యలను రాష్ట్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అలుగూరి హరినాథ్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మండలోజు కృష్ణ ప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఓదెల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.ప్రవీణ్ చారి, రాష్ట్ర కార్యదర్శి కలకోటి వీరభద్ర చారి తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన బాధ్యులను పలువురు జర్నలిస్టులు అభినందించారు.

# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన అడుప రాజు



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్9:ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తాటికాయల రాములు కుటుంబాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు పరామర్శించి అండగా నిలిచారు. మండల పరిధిలోని ఇల్లంద గ్రామంలో బుధవారం రాములు నివాసానికి వెళ్లిన నేతలు, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి నిత్యావసరంగా బియ్యం బస్తాను అందజేశారు. ఈ సందర్భంగా అడుప రాజు మాట్లాడుతూ.. రాములు అకాల మరణం ఆయన కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.కష్టకాలంలో ఉన్న ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, పార్టీ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి కృష్ణమూర్తి, నాయకులు వేల్పుల కార్తీక్, మైదం కన్నయ్య, వేల్పుల అశోక్, చిన్నపెల్లి శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సభా గౌరవాన్ని మంటగలపొద్దు

**స్పీకర్ పదవిని గౌరవించాలి..**

**అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి**

**మహిళా పోలీసుల పట్ల దురుసు ప్రవర్తనపై జాతీయ మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశాం**

**కాళోజీ స్ఫూర్తితో అన్యాయాన్ని ప్రశ్నించాలి**

**ప్రజాకవి రచనలు నేటి తరానికి దిక్సూచి: వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య**





తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: శాసనసభలో స్పీకర్ స్థాయిలో ఉన్న వ్యక్తిపై అనుచిత,అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చడమేనని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.ప్రజాకవి,పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకుని హనుమకొండలోని కాళోజీ విగ్రహానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాళోజీ సేవలను,సాహిత్య ప్రస్థానాన్ని స్మరించుకున్నారు.అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ...స్పీకర్ ఏ కులం,ఏ మతానికి చెందిన వ్యక్తి అన్నది కాకుండా...ఆ కుర్చీని,రాజ్యాంగబద్ధమైన పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు.అనుచిత పదజాలం ఉపయోగించిన వారు తమ తప్పును తెలుసుకుని కూడా క్షమాపణ చెప్పేందుకు ముందుకు రాకపోవడం విచారకరమన్నారు.ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాల్సిన అసెంబ్లీలో ఇలాంటి పదజాలానికి తావివ్వడం ఎవరూ హర్షించరని పేర్కొన్నారు.సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ ఇలాంటి భాషను గతంలో ఎప్పుడైనా ప్రోత్సహించారా? పార్లమెంట్లోగానీ,అసెంబ్లీలోగానీ ఇలాంటి పదజాలం వినడం జరిగిందా? అని ప్రశ్నించారు.తప్పు జరిగితే అంగీకరించి క్షమాపణ చెప్పడం నాయకత్వ లక్షణమని,దాంతో గౌరవం తగ్గదని వ్యాఖ్యానించారు.**మహిళా పోలీసుల పట్ల అమర్యాదపై చర్యలు తీసుకోవాలి** మహిళా పోలీసు సిబ్బందితో వ్యవహరించే తీరుపైనా ఎంపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.మహిళా కానిస్టేబుల్ అయినా,ఉన్నతాధికారి అయినా ప్రతి మహిళను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు.మహిళా పోలీసుల సమక్షంలో కేటీఆర్,హరీష్ రావు చొక్కాలు విప్పడం,ఆందోళన సమయంలో వ్యవహరించిన తీరు తీవ్రంగా అభ్యంతరకరమని పేర్కొన్నారు."ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే అసెంబ్లీలో ప్రశ్నించండి..ప్రభుత్వం సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉంది" అని అన్నారు.ప్రజాధనంతో నడిచే శాసనసభా సమావేశాలను అడ్డుకోవడం,కాలయాపన చేయడం ద్వారా ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు.పార్లమెంట్,శాసనసభ వంటి చట్టసభల్లో టీషర్టులపై రాతలు,ప్లకార్డులు వంటి వాటికి నిబంధనల ప్రకారం అనుమతి ఉండదని గుర్తుచేశారు.**మహిళల భద్రతపై స్పష్టమైన సందేశం అవసరం?** మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న సమయంలో,చట్టాన్ని అమలు చేసే మహిళా పోలీసులే రాజకీయ ఆందోళనల్లో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే భవిష్యత్తులో వారు విధులు నిర్వహించేందుకు భయపడే పరిస్థితి ఏర్పడుతుందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజాప్రతినిధులు,ముఖ్యంగా సుదీర్ఘ అనుభవం ఉన్న మాజీ మంత్రులు వ్యవహరించే తీరు వారి కార్యకర్తలు,అనుచరులకు కూడా ఆదర్శంగా మారుతుందని అన్నారు.ఈ ఘటనపై తాను జాతీయ మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేసినట్లు డా.కడియం కావ్య తెలిపారు.ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి,బాధ్యులైన కేటీఆర్,హరీష్ రావులను కమిషన్ ముందు వివరణ కోరాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.తెలంగాణ డీజీపీ,పోలీస్ కమిషనర్,తెలంగాణ శాసనసభ సెక్రటేరియట్,సంబంధిత అధికార యంత్రాంగం కూడా ఘటనను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు."ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయాలి..విధానాలను ప్రశ్నించాలి..ప్రజా సమస్యలపై పోరాడాలి.కానీ ఆందోళనలు కూడా హుందాగా,ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఉండాలి.మహిళలను గౌరవించడం,చట్టసభల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత" అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.కాళోజీ నారాయణరావు కేవలం కవి మాత్రమే కాదని,తెలంగాణ ప్రజల ఆవేదనకు,ఆకాంక్షలకు, పోరాట స్ఫూర్తికి ప్రతిరూపమని ఎంపీ పేర్కొన్నారు. అన్యాయాలు,సామాజిక అసమానతలు,దోపిడీపై తన కలాన్ని అస్త్రంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపారని తెలిపారు.ఆయన రచనలు ప్రజల గుండె చప్పుడుగా మారాయని అన్నారు.కాళోజీ కవిత్వం,రచనలు ప్రజలు తమపై జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ప్రశ్నించే ధైర్యాన్ని కల్పించాయని డా.కడియం కావ్య అన్నారు.నిస్తేజంగా,నిస్సారంగా కాకుండా సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించాలనే స్ఫూర్తిని కాళోజీ అందించారని చెప్పారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ ఆయన ఆలోచనలు,రచనలు ప్రజల్లో చైతన్యం రగిలించాయని పేర్కొన్నారు.కాళోజీ పుట్టిన వరంగల్కు ఆయనతో ప్రత్యేక అనుబంధం ఉందని,ప్రజాకవి పుట్టిన నేలలో ప్రజాప్రతినిధిగా ఉండటం గర్వంగా ఉందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు.నేటి తరం కాళోజీ రచనలను విస్తృతంగా చదివి,ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కాళోజీ జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం అందించే కాళోజీ స్మారక పురస్కారం ఆయన సాహిత్య,సామాజిక సేవలకు ఇచ్చే గౌరవానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు.కాళోజీ స్ఫూర్తితో మరిన్ని రచనలు,కవిత్వం వెలువడి ప్రజలను చైతన్యపరచాలని ఆకాంక్షించారు.అనంతరం కాళోజీ జయంతి సందర్భంగా సాహితీవేత్తలు,విద్యావేత్తలు,ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్ పాయ్,కలెక్టరేట్ ఇతర అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్..

**- క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతుంది: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**






తొలి అక్షరం/కరీంనగర్ సెప్టెంబర్ 09: యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు, ముఖ్యంగా బాలికలను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్ కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రగ్బీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన మేయర్.. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఖేలో ఇండియాఅస్మిత వంటి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని మేయర్ తెలిపారు. మట్టిలోని మాణిక్యాలను గుర్తించి వారికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖేలో ఇండియాఅస్మిత వంటి కార్యక్రమాలను యువ క్రీడాకారులు, ముఖ్యంగా బాలికలు సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని మేయర్ ఆకాంక్షించారు.కరీంనగర్ జిల్లాలో రగ్బీ క్రీడ అభివృద్ధికి రగ్బీ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా చేస్తున్న కృషిని మేయర్ అభినందించారు. ఇటువంటి పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి వేదిక లభిస్తుందని అన్నారు.ఈ టోర్నమెంట్‌లో వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీ శివకృష్ణ, పెద్దపల్లి జిల్లా సెక్రటరీ రామకృష్ణ, సిద్దిపేట జిల్లా సెక్రటరీ అజయ్, రాజన్న సిరిసిల్ల జిల్లా సెక్రటరీ హనుమంతు, జగిత్యాల జిల్లా సెక్రటరీ మహిపాల్, వెంకటేశ్వర హాస్పిటల్ అడ్మిన్ వెంకటేశ్వర్లు, రగ్బీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషబాబు తదితరులు పాల్గొన్నారు.